సాక్షి సంగారెడ్డి

ఆదివారం । 26 । జనవరి । 2025

సండే స్పెషల్



దేశభక్తి.. చరిత్రకు స్ఫూర్తి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గణతంత్ర వేడుకలకు సిద్ధమయ్యారు. గ్రామాల్లోని చారిత్రాత్మకమైన నేపథ్యం ఉన్న బురుజులపై జెండా రెపరెపలాడనుంది. వివరాలు 8లో ▸



చదువుల్లో మేటి.. చలో ఢిల్లీ

ఢిల్లీకి వెళ్లి రిపబ్లిక్ డే వేడుకలను నేరుగా తిలకించే అవకాశమొస్తే ఎగిరి గంతేస్తాం. వివరాలు 8లో ▸



ఓటరు దినోత్సవ ర్యాలీ

జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు ర్యాలీలు నిర్వహించారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

ఘనపూర్ ఆయకట్టుకు సింగూరు నీరు



జలవిద్యుత్ కేంద్రం నుంచి నీటి ప్రవాహం

పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టు నుంచి ఘనపూర్ ఆయకట్టుకు శనివారం సాగునీటిని వదిలారు.0.35 టీఎంసీల నీటిని జలవిద్యుత్ కేంద్రం ద్వారా వదలడంతో రెండు టర్బయిన్లను రన్ చేసి విద్యుదుత్పత్తి చేస్తున్నారు. ఏటా ఘనపూర్ ఆయకట్టుకు సింగూరు నుంచి విడతల వారీగా సాగునీటిని వదులుతారు. ఈ సాగునీరు మంజీరా గుండా ఘనపూర్ ఆయకట్టుకు చేరుకుంటుంది.

సంక్షేమ పథకాల అమలు కాంగ్రెస్‌తోనే సాధ్యం

ఎంపీ సురేశ్‌కుమార్ షెట్కార్



కంగ్టిలో కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ఎంపీ సురేశ్‌కుమార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి

కంగ్టి (నారాయణఖేడ్): రైతులతోపాటు పేద వర్గాలకు సంక్షేమ పథకాలు అమలు చేయడం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఎంపీ సురేశ్‌కుమార్ షెట్కార్ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి కంగ్టిలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి కలిసి కందుల మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. రైతులు మద్దతు ధరకు కందులు అమ్ముకుని లాభాలు పొందాలని సూచించారు. రైతులు అమ్ముకునే చివరిగింజ వరకు కొనుగోలు చేస్తామని రైతులు ఆందోళన చెందవద్దని ఎంపీ సూచించారు. అనంతరం దెగుల్‌వాడి గ్రామంలో నెషనల్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో రూ. 20 లక్షల వ్యయంతో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

ఓటు హక్కు ప్రాథమిక బాధ్యత: కలెక్టర్ క్రాంతి



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ క్రాంతి తదితరులు

సంగారెడ్డి జోన్: ఓటు హక్కు ప్రతీ పౌరుడి ప్రాథమిక బాధ్యతని, అర్హులైన ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. 15వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పట్టణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి ఐబీ నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించిన ఓటరు ర్యాలీని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ప్రారంభించారు. ఉద్యోగులు, విద్యార్థులతో ఓటర్ల ప్రతిజ్ఞ చేయించారు. వివిధ శాఖలలో ఉత్తమ సేవలందించిన సీనియర్ సిటిజన్లను ఘనంగా సన్మానించారు. నూతనంగా ఓటర్లుగా నమోదుచేసుకున్నవారికి ఓటర్ గుర్తింపు కార్డులను వారు అందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, డీఆర్‌వో పద్మజారాణి, పీడీ డీఆర్‌డీఏ జ్యోతి, డీపీవో శివ ప్రసాద్, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ ఆంథోనీ విద్యార్థులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే గూడెం



కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని భవానీపురం వెంకటరమణ కాలనీలో సహగర్ ప్రైవేట్ లిమిటెడ్ సౌజన్యంతో నిర్మించిన కమ్యూనిటీ హాల్ భవనాన్ని శనివారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..కాలనీ వాసుల సౌకర్యార్థం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందించిన సంస్థకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ తెలంగాణకూ
ప్రమాదమే

సీపీఐఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

ప్రారంభమైన సీపీఎం రాష్ట్ర 4వ మహాసభలు

- ఐబీ నుంచి బహిరంగ సభ వరకు ర్యాలీ
- పాల్గొన్న పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకరత్

సంగారెడ్డి ఎడ్యుకేషన్: బీజేపీ దేశానికే కాదు తెలంగాణ కూడా ప్రమాదకరంగా మారుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పేర్కొన్నారు. సంగారెడ్డిలో శనివారం నుంచి మూడురోజుల పాటు జరగనున్న సీపీఎం రాష్ట్ర 4వ మహాసభలకు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, బృందాకరత్‌తోపాటు సీపీఎం రాష్ట్ర ముఖ్యనేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా సంగారెడ్డి పట్టణంలోని ఐబీ నుంచి భారీ ర్యాలీని చేపట్టారు. అనంతరం నిర్వహించిన బహిరంగసభలో తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ...తెలంగాణలో బీజేపీ వేగంగా ఎదుగుతోందని, ఎన్నడూలేని విధంగా పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్ల శాతంతోపాటు సీట్ల శాతం కూడా పెరిగిందన్నారు. కులాలు, మతాల పేరుతో ప్రజల మధ్య బీజేపీ విద్వేషాలు రెచ్చగొట్టి ఎన్నికల్లో లబ్ధిపొందాలని చూస్తోందని తెలిపారు. మతోన్మాద బీజేపీ కుట్రలను ఎదుర్కొనేందుకు, సమస్యలపై పోరాటాలు చేసేందుకు సీపీఎం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని స్పష్టం చేశారు. బీజేపీపై పోరుకు కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌తోపాటు సామాజిక శక్తులు కలసి రావాలని పిలుపునిచ్చారు.

బీఆర్‌ఎస్ తీరులోనే కాంగ్రెస్ కూడా...

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వీరయ్య మాట్లాడుతూ...రాష్ట్రంలో తొమ్మిదేళ్ల అహంకార ప్రభుత్వాన్ని కూలగొట్టామనే సంతోషం ఎక్కువ కాలం నిలవలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బీఆర్‌ఎస్ పాలన మాదిరిగానే వ్యవహరిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా ఇళ్లు నిర్మిస్తామని చెప్పిన కేంద్రం ప్రభుత్వం ఇప్పటివరకు తెలంగాణలో ఎన్ని ఇళ్లు నిర్మించిందో లెక్కచెప్పాలన్నారు. తెలంగాణకు మణిహారంలా ఉన్న సింగరేణిని ప్రైవేట్‌పరం చేసేందుకు మోదీ ప్రభుత్వం పూనుకుంటే దానికి కాంగ్రెస్ ప్రభుత్వం వత్తాసు పలకడం సిగ్గుచేటని మండిపడ్డారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వంతో కొట్లాడి నిధులు తీసుకురాలేక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రధానితో పెద్దన్న అంటూ దోబూచులాడుతున్నారని ఎద్దేవా చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై పోరుకు భావసారుప్యత కలిగిన రాజకీయపార్టీలు, అన్ని సామాజిక శక్తులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం ఆహ్వాన కమిటీ చైర్మన్ చుక్కా రాములు, సీపీఎం రాష్ట్ర నాయకులు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, జ్యోతి, భాస్కర్, జయరాజు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



ఎరుపెక్కిన సంగారెడ్డి

సంగారెడ్డి పట్టణం అరుణపతాకాలతో ఎరుపెక్కింది. మహాసభలకు రాష్ట్రం నలుమూలలనుంచి పార్టీ నాయకులు కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. కళాకారులు డప్పు వాయిద్యాలతో ఎర్ర జెండా పాటలు పాడుతూ కామ్రేడ్‌లను ఉత్తేజ పరిచారు.



సంగారెడ్డిలో శనివారం జరిగిన బహిరంగ సభకు హాజరైన సీపీఎం పార్టీ శ్రేణులు

లెక్కలు ఎక్కిస్తున్నారు

జిల్లాలో సాగేతర భూమి 15,313.30 ఎకరాలుగా గుర్తింపు

- ఇప్పటికే ప్రారంభమైన ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ
- రెవెన్యూ గ్రామాల వారీగా వివరాలు
- వ్యవసాయ, రెవెన్యూ అధికారులు వేర్వేరుగా డేటా ఎంట్రీ

సంగారెడ్డి జోన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న రైతు భరోసా కార్యక్రమం ఈనెల 26 నుంచి అమలు చేయనుంది. అందుకు సంబంధించి గ్రామాల్లో ఈ నెలలో 16 నుంచి 20 వరకు వ్యవసాయ శాఖ, రెవెన్యూ అధికారులు సర్వే ద్వారా గుర్తించిన సాగేతర, సాగు భూములను జాబితాను తయారు చేశారు. గ్రామ సభలు ముగిసిన నేపథ్యంలో సాగేతర భూముల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను ప్రారంభించారు. జిల్లాలో రెవెన్యూ గ్రామాల వారికి వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులు వేర్వేరుగా రైతు భరోసా పోర్టల్‌లో సాగేతర భూముల వివరాలను నమోదు చేసే ప్రక్రియను చేపట్టారు. మండల వ్యవసాయ శాఖ అధికారి లాగిన్‌లో, తహసీల్దార్ లాగిన్‌లో సర్వే చేసిన సాగేతర భూముల వివరాలను నమోదు చేస్తున్నారు.

సాగు భూములు 7,79,073 ఎకరాలు

జిల్లా వ్యాప్తంగా 15,313.30 ఎకరాలు సాగేతర భూములు, 7,79,073 సాగు చేసే భూములను గుర్తించారు. సర్వే నంబరు ఆధారంగా సాగుకు యోగ్యం కానివి ఇళ్ల స్థలాలు, నిర్మించుకున్న ఇళ్లు, వెంచర్లు, లేఅవుట్‌లు, నాలా, రాళ్లు రప్పల భూముల వివరాలు మాత్రమే నమోదు చేస్తారు. ఆయా గ్రామాల్లో గ్రామ సభలు పూర్తయిన నేపథ్యంలో వాటి ఆధారంగా వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.



ఝరాసంగంలో వివరాలు నమోదు చేస్తున్న ఏవో వెంకటేశ్వర్, ఏఈవోలు

నమోదు ప్రక్రియ కొనసాగుతోంది



జిల్లాలో సాగేతర భూముల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ కొనసాగుతోంది. గ్రామ సభల్లో లభించిన సమాచారం ఆధారంగా పోర్టల్‌లో వ్యవసాయ శాఖ లాగిన్‌లో వివరాలు అప్‌లోడ్ చేస్తున్నాం.

– శివప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి, సంగారెడ్డి

నియోజకవర్గం	రెవెన్యూగ్రామం	సాగు భూములు (ఎకరాల్లో)	సాగేతర భూములు (ఎకరాల్లో)
అందోల్	141	1,79,590	1,534.15
నారాయణఖేడ్	140	2,04,283	1,238.32
నర్సాపూర్	33	37,371	573.00
పటాన్‌చెరు	67	48,806	5,837.35
సంగారెడ్డి	83	1,06,196	2,693.30
జహీరాబాద్	136	2,02,822	3,619.17

ముగ్గురు ఉపాధ్యాయులపై వేటు

విద్యార్థులతో రాళ్లు మోయించిన ఘటనలో...

సంగారెడ్డి జోన్: పట్టణంలోని ఏపీహెచ్‌బీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో పనులు చేయిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులపై వేటు పడింది. కలెక్టర్ ఆదేశాల మేరకు ముగ్గురు ఉపాధ్యాయులను సస్పెన్షన్ చేస్తూ జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం పాఠశాల సమయంలో పాఠశాల క్రీడా మైదానంలో ఉన్న రాళ్లు ఇతర సామగ్రిని విద్యార్థులతో మోయిస్తున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. దీంతో స్పందించిన కలెక్టర్ వెంటనే సంబంధిత ఉపాధ్యాయులపై చర్యలకు ఆదేశించారు. విచారణ జరిపిన జిల్లా విద్యాధికారి పాఠశాలకు చెందిన ముగ్గురు ఉపాధ్యాయులు మంజుల, శారద, నాగమణిలను సస్పెన్షన్ చేశారు.



పాఠశాలలో విచారణ చేస్తున్న కార్మికశాఖ అధికారులు

వైజ్ఞానిక ప్రదర్శనలో వినయ్‌కు రెండోస్థానం

సంగారెడ్డి ఎడ్యుకేషన్: పుదుచ్చేరిలో ఈ నెల 21నుంచి 25వ తేదీ వరకు ఐదు రోజులపాటు జరిగిన దక్షిణ భారతదేశ స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో సంగారెడ్డి జిల్లాకు చెందిన ఉపాధ్యాయుడు వినయ్ కుమార్ రెండవ స్థానంలో నిలిచారు. టీచర్ ఎగ్జిబిట్ లో పాల్గొన్న ర్యాలమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తోన్న వినయ్ 'గణిత భావనలను సులభంగా అర్థం చేసుకోవడం'ప్రాజెక్టును ప్రదర్శించారు. ఈయనకు పుదుచ్చేరి స్పీకర్ సెల్వం,విద్యాశాఖ మంత్రి నమఃశివాయ ప్రశంసా పత్రాన్ని, బహుమతిని అందజేశారు. వినయ్ కుమార్‌ను కలెక్టర్ వల్లూరు క్రాంతి, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు పలువురు జిల్లా అధికారులు అభినందించారు.

వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలి

మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

పటాన్‌చెరుటౌన్: స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకు సాగాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పిలుపునిచ్చారు. స్వామి వివేకానంద సేవా సమితి జిల్లా అధ్యక్షుడు శేషాద్రి, సభ్యులతో కలసి శనివారం హైదరాబాద్‌లోని ఎంపీ నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద సేవ సమితి క్యాలెండర్‌ను ఎంపీ ఆవిష్కరించారు. అనంతరం ఎంపీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్వామి వివేకానంద సేవ సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి రాఘవేందర్‌నాథ్, సభ్యులు విక్రమ్ కులకర్ణి ,యాదగిరి, సంతోష్ పాల్గొన్నారు.

ఎంఎంటీఎస్ అందుబాటులోకి తీసుకురండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం, తెల్లాపూర్ ప్రాంతవాసులకు ఎంఎంటీఎస్ రైలు సేవలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకునిరావాలని ఎంపీ రఘునందన్‌రావు పేర్కొన్నారు. ఎంఎంటీఎస్ ఆపరేషనల్ హెడ్ పద్మజతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. రామచంద్రాపురం ఎంఎంటీఎస్ రైల్వేస్టేషన్‌ను రాత్రి సమయంలో పార్కింగ్‌కు మాత్రమే వాడుతున్నారే తప్ప ప్రజలకు సరిపడా సర్వీస్‌లను నడపడంలేదని వివరించారు. తెల్లాపూర్ రైల్వేస్టేషన్‌లో ఫుట్‌ఓవర్ బ్రిడ్జీను వెంటనే ఏర్పాటు చేయాలని కోరగా..అధికారులు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న రఘునందన్‌రావు

గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

సంగారెడ్డి జోన్: గణతంత్ర వేడుకలకు పోలీస్ పరేడ్ గ్రౌండ్ ముస్తాబైంది. జిల్లా కేంద్రంలోని పరేడ్ గ్రౌండ్ సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం 9గంటలకు కలెక్టర్ వల్లూరు క్రాంతి హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం పోలీసుల గౌరవవందనం స్వీకరిస్తారు. 9:15 నిమిషాలకు సందేశం, 10గంటలకు వివిధ శాఖల శకటాల ప్రదర్శన, 10:30కు విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. అనంతరం జిల్లాలోని వివిధ శాఖలలో విధి నిర్వహణలో విశేష కృషి చేసిన వారికి ప్రశంసా పత్రాలను అందించనున్నారు. అనంతరం స్టాల్స్ పరిశీలిస్తారు. పరేడ్ గ్రౌండ్‌లో పోలీసు అధికారులు భారత దేశ పటాన్ని సుందరంగా వేశారు. గ్రౌండ్ ఆవరణలో బాంబ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు.



గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన టెంట్లు



పరేడ్ గ్రౌండ్‌లో తనిఖీలు

ట్రాఫిక్‌రూల్స్ పాటించండి: ఎస్పీ రూపేశ్

పటాన్‌చెరు టౌన్: ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాలను నివారించాలని ఎస్పీ రూపేశ్ పిలుపునిచ్చారు. శనివారం అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో యువతకు, వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఆన్‌లైన్ కాల్స్ చేసి పోలీసులమని డ్రగ్స్, మనీలాండరింగ్ కేసులలో అనుమానితులుగా ఉన్నావని, నగదు చెల్లించాలని చెబితే నమ్మవద్దని వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి, పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



డిజిటల్ అరెస్టులపై అవగాహన కల్పిస్తున్న ఎస్పీ, డీఎస్పీలు

పురోగతిన పురపాలికలు

సాక్షి ప్రత్యేకం

నేటితో ముగుస్తున్న పాలక వర్గాల గడువు

జిల్లాలోని మున్సిపాలిటీలు ప్రగతి బాట పట్టాయి. మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా పాలకులు చర్యలు చేపట్టారు. నిధుల కొరత వల్ల కొన్ని ముఖ్యమైన పనులు పూర్తి చేయలేకపోయామనే అసంతృప్తి వ్యక్తం చేశారు. మున్సిపల్ పాలక వర్గాల గడువు నేటితో ముగుస్తుండటంతో వారు సాధించిన ప్రగతిపై ఆయా చైర్మన్, చైర్‌పర్సన్‌లతో 'సాక్షి' ముఖాముఖి..



బొల్లారం మున్సిపల్ కార్యాలయం

ఖేడ్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశా



నారాయణఖేడ్: ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకుని నారాయణఖేడ్ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేశాను. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తనకు లభించిన తొమ్మిది నెలల కాలంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి, ఎంపీ సురేశ్ షెట్కార్‌ల సహకారంతో పలు అభివృద్ధి పనులు చేపట్టాం. పట్టణంలోని మెజార్టీ కాలనీల్లో రూ.20కోట్లతో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు నిర్మించాం. పట్టణానికి ట్రాఫిక్ ఇబ్బందులు తీర్చేందుకు కొత్త బైపాస్, రింగు రోడ్ల నిర్మాణం చేస్తున్నాం. మరో రూ.30కోట్ల పనులను ప్రతిపాదించాం. త్వరలోనే వాటిని కూడా ప్రారంభించే అవకాశముంది. పట్టణంలో జనాభాకు తగినట్లుగా మౌలిక సదుపాయాలు కల్పించాం. బీఆర్‌ఎస్ కాలంలో పట్టణాభివృద్ధిని పట్టించుకోలేదు. ఇష్టానుసారంగా ఇంటి పన్నులు విధించారు. వాటిని పునఃపరిశీలిస్తున్నాం. పట్టణంలో డివైడర్‌తో ఇరుకుగా మారిన రోడ్డును మరమ్మతులు చేసేందుకు ప్రతిపాదించాం. త్వరలోనే ఈ పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఈ ఐదేళ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధి, చేసిన ప్రజాసేవ సంతృప్తినిచ్చింది. పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధికి కౌన్సిలర్లు, వైస్ చైర్మన్ అందరం సమిష్టిగా కృషి చేశాం. సహకరించిన పాలకవర్గానికి, ప్రజా ప్రతినిధులకు, ప్రజలకు కృతజ్ఞతలు. మరోసారి అవకాశం లభిస్తే ఇంతకుమించిన ప్రగతిని సాధిస్తాం.

ఆనంద్ స్వరూప్ షెట్కార్, ఖేడ్ మున్సిపల్ చైర్మన్,

ఐదేళ్లలో రూ.326కోట్లతో అభివృద్ధి పనులు



పటాన్‌చెరు: అమీన్‌పూర్ పట్టణాన్ని గత ఐదేళ్ల కాలంలో రూ.326 కోట్లతో అభివృద్ధి చేశాం. అమీన్‌పూర్ పట్టణంలో ప్రధానంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యలకు శాశ్వతంగా పరిష్కరించాం. అక్కడక్కడ ఇంకా కొన్ని డ్రైన్‌లను అభివృద్ధి చేయాల్సి ఉంది. ఇప్పుడు ఏ గల్లీకి వెళ్లినా సిమెంట్ లేదా తారు రోడ్డు కనిపిస్తుంది. నవ్య చౌరాస్తా నుంచి అమీన్‌పూర్‌కు ప్రధాన రహదారిని వేయగలిగాం. భరత్‌నగర్ కాలనీ, సాయి భగవాన్ కాలనీ, లింగమయ్య- టైలర్స్ కాలనీలకు రోడ్లు వేశాం. మౌలికవసతులు కల్పించాం. రూ.1.16కోట్లతో పీఎస్‌ఆర్ కాలనీలో పంచతత్వ పార్కును పూర్తి చేయగలిగాం. పట్టణానికి స్టేడియానికి స్థలం గుర్తించి కొంతవరకు భూమి చదును పనులు ప్రారంభించాం. లింగంపల్లి వైపు నుంచి అమీన్పూర్ బొల్లారం రోడ్డు పనులు మాత్రం పూర్తికాలేదు. రోడ్డు విస్తరణకు బందంకొమ్ము చెరువు అడ్డంకిగా మారింది. దాంతో రోడ్డు సకాలంలో పూర్తి చేయలేకపోయామనే అసంతృప్తి ఉంది. ప్రత్యేక విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేశాం.

తుమ్మల పాండురంగారెడ్డి, అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్

అభివృద్ధి పనులతో సంతృప్తిగా ఉంది



జిన్నారం (పటాన్‌చెరు): ప్రజల అవసరాలకనుగుణంగా పెద్దఎత్తున అభివృద్ధి పనులు పూర్తి చేయడం సంతోషంగా ఉంది. అనుకున్నస్థాయిలో ప్రణాళికబద్ధంగా సుమారు రూ.100 కోట్ల నిధులతో బొల్లారం మున్సిపాలిటీని అభివృద్ధి చేశాం. పట్టణ పరిధిలోని 22 వార్డుల్లో రాజకీయాలకతీతంగా అభివృద్ధి జరిగింది. పట్టణంలో అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పన కోసం అందరితో చర్చించి పాలకవర్గం నిర్ణయాలు తీసుకుంది. ప్రధానంగా సీసీరోడ్లు, అంతర్గత మురికి కాలువలు, శ్మశానవాటికలు, పార్కులు ఏర్పాటు చేశాం. మిషన్ భగీరథ పంప్ హౌస్ నిర్మాణంతో బొల్లారం మున్సిపాలిటీకి త్రాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కారం చూపినట్లైంది. మాజీమంత్రి హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సహాయ సహకారాలతో మున్సిపాలిటీని శరవేగంగా అభివృద్ధి పథంలో నిలబెట్టాను. అయితే మినీ స్టేడియం నిర్మించేందుకు కేటాయించిన స్థలంకు సంబంధించి కేసు కోర్టులో ఉండటంతో మున్సిపాలిటీలో స్టేడియం ఏర్పాటు చేయలేకపోయాం. మా హయాంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ స్టేడియం నిర్మాణం పెండింగ్‌లో ఉండిపోయింది. గడిచిన ఐదేళ్లలో మున్సిపాలిటీ అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా కృషి చేశాం. ప్రజలు, ప్రజాప్రతినిధులు అధికారుల భాగస్వామ్యంతో ప్రగతి పథంలో ముందుకు సాగడం సంతృప్తినిచ్చింది. తనకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు.

– కొలన్ రోజా, బొల్లారం మున్సిపల్ చైర్ పర్సన్

క్లుప్తంగా

మహిళ కాలుపై నుంచి వెళ్లిన బస్సు

జిన్నారం (పటాన్‌చెరు): మహిళ కాలుపై నుంచి ఆర్టీసీ బస్సు వెళ్లిన ఘటన గుమ్మడిదల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై మహేశ్వర్ రెడ్డి కథనం మేరకు.. కొడిపల్లి మండలం పాంపల్లి గ్రామానికి చెందిన మహంకాళీ భారతి (55) కొడిపల్లి నుంచి దోమడుగుకు వచ్చేందుకు శనివారం ఉదయం మెదక్ డిపో బస్సులో బయలుదేరి బొంతపల్లి కమాన్ వద్ద దిగింది. దిగాక అక్కడే నిలిచి ఉండటాన్ని గమనించని డ్రైవర్ ముందుకు వెళ్తున్న క్రమంలో వెనుక టైర్ ఆమె కాలుపై నుంచి వెళ్లింది. ఈ ప్రమాదంలో కాలు నుజ్జునుజ్జయ్యింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని చికిత్స నిమిత్తం మహిళను సూరారం మల్లారెడ్డి ఆసుపత్రికి తరలించారు. మహిళ కుమారుడి ఫిర్యాదు మేరకు డ్రైవరుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వేర్వేరే ఘటనల్లో ముగ్గురి అదృశ్యం


శ్రావణి (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: ఇంట్లో పాపని వదిలేసి గృహిణి అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని చైతన్యకాలనికి చెందిన శ్రావణి (20), శనివారం ఇంట్లో పాపను వదిలేసి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు స్థానికంగా వెతికిన ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం


యమున (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: యువతి అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులలల కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ ప్రముఖనగర్ కాలనీకి చెందిన యమున(23), ఈనెల 20న ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద బంధువుల వద్ద వెతికిన ఆచూకీ లభించలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం


నారాయణ (ఫైల్)

హత్నూర(సంగారెడ్డి): వ్యక్తి అదృశ్యమైన సంఘటన హత్నూర మండలం రెడ్డి ఖానాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కామారెడ్డి జిల్లా, బికనూర్ మండలం, మల్లుపల్లి గ్రామానికి చెందిన మాలే నారాయణ(42), గత 3 సంవత్సరాల క్రితం ఉపాధి నిమిత్తం హత్నూర మండలం రెడ్డిఖానాపూర్‌లో ఎఫ్‌పీఓ ఆఫీస్‌లో సీఈఓగా పనిచేస్తూ రెడ్డిఖానాపూర్ గ్రామంలో కిరాయికి ఉంటున్నాడు. 24 శుక్రవారం రాత్రి బోరపట్ల గ్రామంలో బీరు తీసుకొని వస్తానని చెప్పి రూం నుంచి బైక్‌పై వెళ్లి తిరిగి రాలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గణతంత్ర దినోత్సవం శుభాకాంక్షలు

దేశభక్తి.. చరిత్రకు స్ఫూర్తి

సండే స్పెషల్

- చారిత్రాత్మక బురుజులపై ఎగురనున్న జాతీయ జెండా
- మాజీ సైనికులు, పోరాట యోధులకు గుర్తుకు స్మారక స్థూపాలు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేకతను చాటుతున్న కొన్ని ప్రాంతాలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గణతంత్ర వేడుకలకు సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని చారిత్రాత్మకమైన నేపథ్యం ఉన్న బురుజులపై జెండా రెపరెపలాడనుంది. గ్రామస్తులు, పార్టీలకు అతీతంగా నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై బురుజుల వద్ద జెండా ఎగురవేయనున్నారు. కొన్ని చోట్ల ఏడాది పొడవునా జెండా గగనతలంలో రెపరెపలాడనుంది. మరికొన్ని చోట్ల అమర జవాన్‌లు, పోరాట యోధులుగా గుర్తుగా స్తూపాలను ఏర్పాటు చేసి త్రివర్ణ పతాకాన్ని ఎగురవేస్తున్నారు. ఇలాంటి ప్రత్యేకతను కలిగి ఉన్న వాటిపై గణతంత్ర దినోత్సవం సందర్భంగా కథనం..

వందేళ్ల కిందటి బురుజు


లాల్ కమాన్


చారిత్రక బురుజు

సిద్దిపేటజోన్: సిద్దిపేట జిల్లా కేంద్రంలో బురుజు అనే పదం ప్రసిద్ధి చెందింది.. చారిత్రాత్మకమైన నేపథ్యంలో ఉన్న బురుజు కొన్ని వందల ఏళ్ల కిందట నిర్మించినట్టు చరిత్ర చెబుతోంది. సిద్దిపురం అనే పట్టణానికి మధ్యలో లాల్‌కమాన్ ప్రధాన ద్వారంగా నలు దిక్కుల నాలుగు బురుజులు శత్రువుల నుంచి రక్షణ కోటకు అనుసంధానంగా ప్రహరీ ఉండేది. కాలక్రమేణా మూడు బురుజులు కనుమరుగు అయ్యాయి. ప్రస్తుతం చరిత్రకు ఆనవాళ్లుగా లాల్‌కమాన్, ఒకే ఒక బురుజు మిగిలింది. నిజాం పాలన అనంతరం స్వాతంత్ర్యం వచ్చిన నేపథ్యంలో బురుజు మీద, లాల్ కమాన్ పైన స్వాతంత్ర్య వేడుకలకు సూచికగా ప్రతీసారి జాతీయ జెండా ఎగురవేయడం ఆనవాయితీగా వస్తుంది.నాలుగు ఏళ్ల బురుజులో దేశభక్తి భావం ఉట్టిపడేలా అందంగా త్రివర్ణ శోభితంగా రంగులు దిద్దారు.

ఇక్కడ మూడు సార్లు జెండా ఎగురవేత


బైరాన్‌పల్లి గ్రామంలోని బురుజు

మద్దూరు(హుస్నాబాద్): దేశంలో ఎక్కడైనా స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సం రెండు సార్లు మాత్రమే జాతీయ జెండాను ఎగురవేస్తుంటారు. కానీ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో వీరత్వం చూపిస బైరాన్‌పల్లి గ్రామంలో మాత్రం బురుజుపై స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాలతోపాటు సెప్టెంబర్ 17న కూడా జాతీయ జెండాను ఎగురవేస్తారు. 1948 సెప్టెంబర్ 17 నుంచి ఈ విధంగా జాతీయ జెండాను ఎగురవేస్తున్నారు. దేశంలో 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం రాగా తెలంగాణకు మాత్రం 1948 17న స్వాతంత్రం వచ్చింది. దేశానికి బ్రిటిష్ పాలన నుంచి విముక్తి లభిస్తే తెలంగాణకు మాత్రం నిజాం నుంచి విముక్తి లభించింది. అప్పటి నుంచి గ్రామస్తులు బురుజు పై జెండాను ఎగురవేస్తారు.

సోలార్‌తో విద్యుత్


టేక్మాల్‌లో సోలార్ ప్లాంట్

టేక్మాల్(మెదక్): టేక్మాల్ మండలంలోని మూడు సోలార్ ప్లాంట్ల ద్వారా సూర్యరశ్మితో విద్యుత్ ఉత్పత్తిని చేస్తున్నారు. మండలంలో ఏర్పాటు చేసినా వీఈ ఎనర్జి సోలార్ కంపెనీ ద్వారా 50 మెగావాట్స్ కెపాసిటీ విద్యుత్‌ను, రెన్యూ పవర్ కంపెనీ ద్వారా 64 మెగావాట్స్ కెపాసిటీ విద్యుత్‌ను, దినాకర్ టెక్నాలజీ (అదానీ) ద్వారా 24 మెగావాట్స్ కెపాసిటీ విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. సోలార్ ప్లాంట్ ద్వారా ఉత్పత్తి అయినా విద్యుత్‌ను పాపన్నపేట మండలం మిన్‌పూర్ 220 కేవీ సబ్‌స్టేషన్‌కు పంపుతున్నారు.

నిరంతరం గగనతలం

- తుమ్కిఖాల్సాలో 48 అడుగుల ఎత్తుతో త్రివర్ణ పతాకం



వర్గల్(గజ్వేల్): వర్గల్ మండలం తున్కిఖాల్సా గ్రామ పల్లె ప్రకృతి వనంలో ఏడాది పొడుగునా నింగిని తాకేలా 48 అడుగుల ఎత్తున జాతీయ జెండా రెపరెపలాడుతోంది. దేశ భక్తికి చిహ్నంగా, ఊరికి ఒక గుర్తింపుగా ఉండేలా మాజీ సర్పంచ్ కటికె సంధ్యజానీ దంపతులు నాలుగేళ్ల కిందట 2021 జనవరిలో భారీ జాతీయ జెండాను ఏర్పాటు చేయించారు. జెండా స్తంభం ఎత్తు 48 అడుగులు ఉంటుంది. దానికి చివరన బిగించే త్రివర్ణపతాకం 12 అడుగుల ఎత్తు, 18 అడుగుల వెడల్పు కలిగి ఉంటుంది. గాలి తాకిడి తట్టుకునేలా పటిష్టమైన గద్దెను నిర్మించారు. ఆహ్లాదాన్ని పంచే పల్లె ప్రకృతి వనంలో కొలువుదీరిన ఈ పతాకాన్ని తొలిసారి 2021జనవరి 26 రిపబ్లికే డే రోజున ఆవిష్కరించారు. నాటి నుంచి ఏడాది పొడుగునా గగనాన రెపరెపలాడుతూ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ప్రతీయేటా స్వాతంత్ర దినోత్సవం, రిపబ్లిక్ డే, తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున ఈ భారీ పతాకావిష్కరణ ఆనవాయితీగా కొనసాగుతుంది. ఏవైనా కలరింగ్, పైపులకు మరమ్మతులైతే తప్ప నిరంతరం పతాకం రెపరెపలాడుతుంది.


తున్కిఖాల్సాలో భారీ త్రివర్ణపతాకం

బురుజుపై జెండా ఆవిష్కరణ


లక్ష్మాపూర్ గ్రామంలోని బురుజుపై జెండా

రామాయంపేట (మెదక్): రామాయంపేట మండలం లక్ష్మాపూర్ గ్రామంలోని బురుజుపై జాతీయ జెండాను ఆవిష్కరించడం ఆనవాయితీగా వస్తుంది. గ్రామానికి చెందిన యువజన సంఘం ఆధ్వర్యంలో ఆరేళ్ల కిందట పతాక ఆవిష్కరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పతాకావిష్కరణ రోజు ప్రత్యేకంగా గ్రామస్తులు, పార్టీలకు అతీతంగా నాయకులు పెద్ద సంఖ్యలో బురుజు వద్దకు చేరుకొని జెండా ఎగురవేస్తారు.

మొదట గాంధీచౌక్ వద్ద


గాంధీచౌక్‌లోని జెండా గద్దె

నారాయణఖేడ్: స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా నాడు రజాకార్ల నిర్బంధాన్ని ఎదుర్కొని జెండా ఎగురవేసి జైలు జీవితాన్ని గడిపి నాటి పోరాట పటిమను చాటి చెబుతూ నేటి తరానికి తెలిసేలా ప్రతీ స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవం రోజున మొట్ట మొదటి జెండా నారాయణఖేడ్‌లోని గాంధీ చౌక్‌లో ఎగురుతుంది. స్వాతంత్ర్యానికి పూర్వం నిజాం నిరంకుశ పాలన సాగుతున్న తరుణంలో పోలీస్‌స్టేషన్ ఎదురుగా గాంధీ చౌక్‌లో మొట్టమొదటి జెండాను స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ ఎమ్మెల్యే అప్పారావుషెట్కార్, శివరావుషెట్కార్‌లు ఎగురవేశారు. జెండా ఎగుర వేసినందుకు నాటి నిజాం పాలకులు 18 నెలలపాటు అప్పారావుషెట్కార్, శివరావుషెట్కార్‌తో పాటు కోస్గికర్ నరసింహారావు మాస్టర్‌లను ఔరంగాబాద్ జైలులో బంధించారు. నాటి నుంచి నేటి వరకు ప్రతీ జెండావిష్కరణ సందర్భంగా ఇక్కడ శివరావుషెట్కార్ కుమారుడు ఎంపీ సురేశ్ షెట్కార్ మొట్టమొదటి జెండాను ఎగురవేస్తారు.

చేతినిండా అభిమానం

పప్పు దినుసులతో జాతీయ జెండా



గజ్వేల్‌రూరల్: పప్పు దినుసులతో 3 అంగులాల జాతీయ జెండాను రూపొందించాడు పట్టణానికి చెందిన కళారత్న అవార్డు గ్రహీత రామకోటి రామరాజు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఎర్ర పప్పు, బియ్యం, పెసర్లను ఉపయోగించి అర చేతిలో జాతీయ జెండాను రూపొందించడం జరిగిందని పేర్కొన్నాడు.

జవాన్ల జన్మభూమి 'ధనసిరి'


సైనికుడిగా దేవరాజ్

జహీరాబాద్ టౌన్: సైన్యంలో చేరడమంటే ప్రాణాలతో చెలగాటమని తెలిసినా.. దేశ రక్షణ కోసం మేము సైతం అంటూ ఆ ఊరిలో ఎన్నో కుటుంబాలు ఆర్మీలో చేరాయి. దేశాన్ని రక్షించే బాధ్యత అందరిదీ, ఇంటి నుంచి ఒకరైనా సైన్యంలో చేరాలన్నదే గ్రామం ప్రజల ఆశయం. తెలంగాణ- కర్నాటక రాష్ట్ర సరిహద్దులో సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలంలో ఉన్న ధనసిరి గ్రామంలోని ఎంతో మంది సైన్యంలో చేరి దేశ సేవ చేస్తున్నారు. ఒకరు కాదు.. ఇద్దరు కాదు సుమారు వంద మంది వరకు ఆర్మీలో వివిధ హోదాలో పనిచేశారు. కొంత మంది ఉద్యోగ విరమణ చేసి పోలీసు శాఖలో సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం పది మంది వరకు సైన్యంలో విధులు నిర్వహిస్తున్నారు. ఈ గ్రామం నుంచి ఏటా కొంత మంది ఆర్మీలో చేరుతుంటారు. ఇటీవలె ఓ యువకుడు నేవీలో చేరాడు. విశ్రాంత జవానులు సైన్యంలో చేరేందుకు యువతను ప్రోత్సహిస్తుంటారు.

అమర జవానుల స్మారక స్థూపం


బీదర్ చౌరస్తాలో స్మారక స్థూపం

జహీరాబాద్ టౌన్: అమర జవానుల జ్ఞాపకార్థం విశ్రాంత జవాన్లు, యువకులు జహీరాబాద్ పట్టణం సమీపంలో బీదర్ చౌరస్తాలో స్మారక స్తూపాన్ని ఏర్పాటు చేశారు. ఐదేళ్ల కిందట స్మారక స్తూపాన్ని ఏర్పాటు చేసి అమర జవానులకు సంబంధించిన ప్రతీ సందర్భంలో నివాళులర్పిస్తున్నారు. దీంతో బీదర్ చౌరస్తా అమర జవాన్‌ల చౌక్‌గా మారింది. స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవంతోపాటు కార్గిల్ విజయ్ దివస్ తదితర సందర్భాల్లో మాజీ సైనికులు, యువకులు అమరులైన జవానులకు నివాళులర్పిస్తున్నారు. మహీంద్ర అండ్ మహీంద్ర కర్మాగారం యాజమాన్యం స్థూపం చుట్టూ పెన్సింగ్ ఏర్పాటు చేసి పూల మొక్కలను నాటించారు. పచ్చదనంతో స్థూపం వచ్చిపాయే వారిని ఆకర్షిస్తుంది.

సమస్యను పరిష్కరించండి


డ్రైనేజీని పరిశీలిస్తున్న కార్పొరేటర్ పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని ఐటీఐ కళాశాల సమీపంలోని జాతీయరహదారిపై డ్రైనేజీ చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సమస్యను వెంటనే పరిష్కారించాలని కార్పొరేటర్ పుష్ప అధికారులను ఆదేశించారు. శనివారం రామచంద్రాపురం పట్టణంలోని జాతీయరహదారిపై డ్రైనేజీ నీరు నిలిచిన ప్రాంతాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పుష్ప మాట్లాడుతూ.. గత రెండు రోజులుగా ఐటీఐ కళాశాల సమీపంలో రోడ్డు డ్రైనేజీ నీరు చేరడంతో విద్యార్థులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జీహెచ్ఎంసీ అధికారులు వెంటనే సమస్యను పరిష్కారించాలని సూచించారు.

ఆర్యవైశ్య మహాసభ ఎన్నికల నోటిఫికేషన్

నారాయణఖేడ్: సంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభకు 2025- 2026వ సంవత్సరానికి సంబంధించి నూతన అధ్యక్షుడిని ఎన్నుకొనేందుకు రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు తోపాజి అనంత్ కిషన్, జిల్లా అధ్యక్షుడు మునిగాల మాణిక్ ప్రభు, జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు జూకంటి లక్ష్మణ్ గుప్తా శనివారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ సారి సంగారెడ్డి డివిజన్‌కు చెందిన వారు మాత్రమే అధ్యక్షుడిగా పోటీ చేసేందుకు అర్హులని తెలిపారు. రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభలో సభ్యత్వం ఉండి ఇప్పటికే మండల, జిల్లా, మహాసభలో అధ్యక్షుడిగా లేదా కార్యవర్గంలో పని చేసిన వారు అర్హులని అన్నారు. పోటీ చేసే వారు రిఫండ్ కాని, రూ.5 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఫిబ్రవరి 9న సంగారెడ్డి లోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఉ.10 గంటల నుంచి పోటీ చేసే వారు నామినేషన్ పత్రాలు పొంది, 1 గంట వరకు సమర్పించాల్సి ఉంటుందన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు నామినేషన్ల పరిశీలన, అనంతరం తుదిజాబితా ప్రకటించడం జరుగుతుందన్నారు. 10న నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుందన్నారు. పోటీ ఉంటే ఫిబ్రవరి 12న ఉ.9 నుంచి 2 గంటల వరకు పోలింగ్, అనంతరం 3 గంటల నుంచి ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన ఉంటుందన్నారు.

నైబర్‌హుడ్ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో తెల్లాపూర్ నైబర్‌హుడ్ ఆధ్వర్యంలో శనివారం క్రీడాపోటీలు నిర్వహించారు. ఈపోటీలను నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వరిగారి రమణ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఏటా గణతంత్ర దినోత్సవం సందర్భంగా గేటెడ్ కమ్యూనిటీ కాలనీవాసులకు క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో 72 గేటెడ్ కమ్యూనిటీలకు చెందిన 1500 మంది క్రీడాకారులు పాల్గొన్నారని వివరించారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

పటాన్‌చెరు టౌన్: ఆటో బోల్తా పడిన ఘటనలో తీవ్ర గాయాలైన వృద్ధురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామం అంబేడ్కర్ కాలనీకి చెందిన కాసాల మల్లమ్మ 23న లక్డారంలో ఉండే కూతురు మంజుల వద్దకు ఆటోలో వెళ్తుండగా మార్గమధ్యలో బోల్తా పడింది. తీవ్ర గాయాలైన ఆమెను చికిత్స నిమిత్తం ముందుగా సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఉస్మానియాకు తరలించగా శనివారం తెల్లవారుజామున మృతి చెందింది. మృతురాలి కుమారుడు సాయిలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చదువుల్లో మేటి.. చలో ఢిల్లీ

- పేదింటి బాలిక హేమకు అరుదైన అవకాశం
- రిపబ్లిక్ డే వేడుకలను నేరుగా తిలకించనున్న విద్యార్థిని
- వర్గల్ గురుకులంలో డిగ్రీ ఫైనలియర్ చదువుతూ ఎంట్రెన్స్‌లో ప్రతిభ


ఢిల్లీ రిపబ్లిక్ డే వేడుకలకు వెళ్తున్న బృందంతో హేమ (కుడి నుంచి నాలుగో బాలిక)

వర్గల్(గజ్వేల్): ఢిల్లీకి వెళ్లి రిపబ్లిక్ డే వేడుకలను నేరుగా తిలకించే అవకాశమొస్తే ఎగిరి గంతేస్తాం. అలాంటి వేడుకలను చూసేందుకు అతిథిగా ఆహ్వానిస్తే ఆ ఆనందం ఊహలకు అందదు. సరిగ్గా అలాంటి అరుదైన అవకాశం తెలంగాణ నుంచి పేదింటి బాలిక, సిద్దిపేట జిల్లా వర్గల్ జ్యోతిబా పూలే గురుకుల డిగ్రీ కళాశాల ఫైనలియర్ విద్యార్థిని తెనుగొండ హేమకు దక్కింది. చదువుల్లో టాపర్‌గా నిలిచినందుకు యశస్వి పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఈ అవకాశం కల్పించింది. ఈ సందర్భంగా హేమ ప్రస్థానంపై ప్రత్యేక కథనం..

పేద కుటుంబం

చదువుల్లో రాణిస్తూ 'పల్లెటూరు నుంచి ఢిల్లీ' కి వెళ్లే అవకాశం దక్కించుకున్న తెనుగొండ హేమ జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం దమ్మయ్యపేట సొంత గ్రామం. ఆమె తల్లిదండ్రులు వెంకటి, స్వరూప. ఐదుగురు పిల్లల్లో పెద్ద కూతురు హేమ. తండ్రి వెంకటి డ్రైవర్. కొద్దిపాటి భూమి ఉన్నప్పటికీ సరిపడా ఆదాయం రాకపోవడంతో డ్రైవర్‌గా పని చేసేందుకు విదేశాలకు వెళ్లారు.

చదువంతా ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే..

కుటుంబ పేదరికం వల్ల హేమ చదువంతా సర్కారీ బడుల్లోనే కొనసాగింది. గ్రామ పాఠశాలలో 5 వరకు, ఎంట్రెన్స్‌లో సిరిసిల్ల బీసీ హాస్టల్‌లో సీటు సాధించి అక్కడి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పది వరకు చదివింది. పట్టుదలగా చదువుతూ టెన్త్‌లో 10 జీపీఏ సాధించింది. ఎంట్రెన్స్ పరీక్ష ద్వారా కరీంనగర్ ఎల్ఎండీ కాలనీలోని జ్యోతిబా పూలే గురుకుల జూనియర్ కళాశాలలో సీటు సాధించి సీఈసీలో చేరింది. 909 మార్కులతో ఉత్తీర్ణురాలైన హేమ అదే ఊపులో ఎంట్రెన్స్ పరీక్షలో ప్రతిభచాటి సిద్దిపేట జిల్లా వర్గల్ పూలే డిగ్రీ కళాశాలలో బీకామ్(సీఏ) సీటు సాధించుకుంది. చదువుకు పేదరికం అడ్డుకాదని చాటుతూ మార్కుల సాధనలో మేటిగా నిలిచింది. డిగ్రీ ఫైనలియర్ నాలుగో సెమిస్టర్‌లో గురుకుల టాపర్‌గా నిలిచి అబ్బురపరిచింది. ప్రాథమిక పాఠశాల నుంచి డిగ్రీ వరకు ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే చదివింది. 'యశస్వి' పథకం ద్వారా న్యూఢిల్లీలో రిపబ్లిక్ డే వేడుకలు తిలకించే అవకాశం దక్కించుకుంది. శుక్రవారం ఉదయం తెలంగాణ రాష్ట్ర బృందంతో ఢిల్లీకి బయల్దేరింది. కాగా హేమ చదువుతో పాటు కరాటేలోనూ బ్రౌన్ బెల్ట్ సాధించింది.

ఈ పథకం గొప్ప వరం



రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకల్లో పాల్గొనే అవకాశం నాకు రావడం అదృష్టంగా భావిస్తున్నాను. ప్రధాన మంత్రి యశస్వీ పథకం ద్వారా తమను ఎంపిక చేసి ఢిల్లీకు పంపిస్తున్నారు. తనకు ఇలాంటి అవకాశం లభించడం చాలా సంతోషంగా ఉంది. ఈ పథకం పేద విద్యార్థులకు టర్నింగ్ పాయింట్ అని చెప్పవచ్చు. ఇది ఉన్నత చదువులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. తాను గణతంత్ర వేడుకల్లో పాల్గొనడానికి కృషి చేసిన జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి జగదీష్, మా వార్డెన్ వెంకటలక్ష్మీలకు కృతజ్ఞతలు.

\- శ్వేత, 10వతరగతి,
బీసీ బాలికల వసతి గృహం,
రామచంద్రాపురం

కలలో కూడా అనుకోలేదు



మాది పేద కుటుంబం నేను ఇంట్లో పెద్ద కూతురిని. తల్లిదండ్రులు కష్టజీవులు. ఇలాంటి పరిస్థితు ల్లో ఎదురీదుతున్న కుటుంబం నుంచి ఢిల్లీకి వెళ్లి ప్రముఖులతో రిపబ్లిక్ డే వేడుకలు తిలకిస్తానని కలలో కూడా అనుకోలేదు. అలాంటి అరుదైన అవకాశం 'చదువు' ద్వారా దక్కడం అనిర్వచనీయ ఆనందం కలిగిస్తుంది. నా జీవితంలో ఇదో మరచిపోలేని గొప్ప జ్ఞాపకంగా నిలుస్తుంది.

\- తెనుగొండ హేమ